క్లుప్తంగా

ప్రతి పోడు సాగుదారుడికీ పట్టా హక్కు కల్పించాలి


మాట్లాడుతున్న కాసాని ఐలయ్య

జూలూరుపాడు: ప్రతి పోడు సాగుదారుడికి పట్టా హక్కు కల్పించాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసాని ఐలయ్య అన్నారు. ఆదివారం జూలూరుపాడులోని సీపీఎం కార్యాలయంలో జరిగిన రైతు సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో లక్షల గిరిజన కుటుంబాలు అడవిని నమ్ముకొని పోడు భూములను సాగు చేసి జీవనం సాగిస్తున్నారన్నారు. ఎన్నో సంవత్సరాలుగా పాలకులు పోడు భూములకు హక్కు పత్రాలు ఇస్తామని చెప్పి వారికి ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. జూలూరుపాడు మండల వ్యాప్తంగా మూడు వేల మంది పోడు రైతులు దరఖాస్తు చేసుకుంటే కేవలం 1500 మందికి మాత్రమే పట్టాలు ఇస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో అన్నవరపు కనకయ్య, యాసా నరేష్, బానోత్ ఇస్రా, వల్లమల చందర్‌రావు పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి..


ఇంటింటి ప్రచారం చేస్తున్న నాయకులు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం నియోజకవర్గంలో సమస్యలు తాండవిస్తున్నాయని సమస్యల పరిష్కారం కోసం బీఎస్పీ ప్రజల పక్షాన పోరాటం చేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ అన్నారు. ఆదివారం కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 30వ వార్డులో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంచి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాట్లాడుతూ.. కొత్తగూడెంలో 10, 15 రోజుల కోసారి మాత్రమే కిన్నెరసాని మంచినీరు వస్తోందని, వార్డు ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చారనీ తెలిపారు. రానున్న ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థికి ఒక్క అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు.

రాజకీయాల్లో ఒడిదుడుకులు సహజం..


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మడత రమా వెంకట్‌గౌడ్

ఇల్లెందు: మాజీ ఎంపీ పొంగులేటి వెంట తమ ప్రయాణం సాగుతుందని ఇల్లెందు మాజీ మున్సిపల్ చైర్మన్ మడత రమ, వెంకట్‌గౌడ్ దంపతులు స్పష్టం చేశారు. ఆదివారం ఉదయం పట్టణంలోని సీతారామా టాకీస్ వెనక తన క్యాంపు కార్యాలయాన్ని వారు ప్రారంభించారు. మాట్లాడుతూ.. రాజకీయాలలో కొంతకాలం వెనుకడుగు వేసినంత మాత్రాన రాజకీయాలకు దూరం అయినట్లు కాదన్నారు. రాజకీయాల్లో ఒడిదుడుకులు సహజమని, ఈ క్రమంలో పార్టీలు మారటం కూడా తప్పిదమేనన్నారు. ఇల్లెందు పట్టణాభివృద్ధికి 120 కోట్ల నిధులు తెచ్చినట్లు చెప్పారు. రానున్న కాలంలోనూ ఇల్లెందు ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతామని తెలిపారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుడికి నివాళి


కృష్ణారావు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాములు నాయక్

జూలూరుపాడు: కరివారిగూడెం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు తాటికొండ కృష్ణారావు ఆదివారం మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని వివిధ రాజకీయ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు సందర్శించి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సంతాపం తెలిపిన వారిలో వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్, జూలూరుపాడు ఎంపీపీ లావుడ్యా సోనీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పొన్నెకంటి సతీష్ కుమార్, నాయకులు యల్లంకి సత్యనారాయణ, పసుపులేటి మోహన్‌రావు, చౌడం నరసింహారావు, వేల్పుల నరసింహారావు, సర్పంచ్‌లు బోడా శాంతిరాం, బానోత్ శాంతిలాల్, లావుడ్యా కిషన్‌లాల్, దేవరకొండ కిరణ్, జూలూరుపాడు సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డు కృష్ణయ్య, లకావత్ లచ్చునాయక్, ముత్తినేని రామయ్య, మాళోత్ మంగీలాల్ నాయక్, నున్నా కృష్ణయ్య, కొలిపాక శ్రీనివాసరావు, ధరావత్ రాంబాబు, తదితరులు ఉన్నారు.

పీహెచ్‌సీకి మోక్షమెప్పుడో?

- జగన్నాథపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధ్వానం
- ఇరుకు గదులతో రోగులు, వైద్యసిబ్బంది అవస్థలు
- రెండుసార్లు నిధులు మంజూరై వెనక్కు వెళ్లిన వైనం


ఆస్పత్రిలో అసౌకర్యంగా వెయిటింగ్ హాల్

పాల్వంచరూరల్: ప్రభుత్వాస్పత్రులను కార్పొరేట్ ఆస్పత్రుల్లా తీర్చిదిద్దుతామని ప్రభుత్వం, పాలకలు చెబుతున్నా ఆచరణలో సాధ్యం కావడం లేదు. నిధులు రాక, సౌకర్యాలు లేక రోజుకు 12 గంటలు మాత్రమే పనిచేస్తోంది జగన్నాథపురంలోని గిరిజన ప్రాథమిక ఆరోగ్యకేంద్రం. మండలంలోని పెద్దమ్మ తల్లి గుడి వద్ద 2004లో అరకొర వసతులతో అద్దెభవనంలో ప్రారంభించారు. నిత్యం 60 నుంచి 70 మంది రోగులు వచ్చిపోతుంటారు. ఆస్పత్రి పరిధిలో ఆరు బెడ్లు, 8 సబ్ సెంటర్లు, పాల్వంచ, ములకలపల్లి, బూర్గంపాడు మండలాల పరిధిలోని 58 గ్రామాల పరిధిలో వైద్యసేవలు అందిస్తున్నారు.

ఇన్‌పేషంట్ గదిలో సామగ్రి..

ఆస్పత్రిలో డాక్టర్ గది, హాల్, ఇన్‌పేషంట్ వార్డు ఉంది. ఇన్‌పేషెంట్ వార్డులో కేవలం ఒక బెడ్ వేసేందుకు మాత్రమే వీలుంది. ఇదే గదిలో ఆస్పత్రి సామగ్రితో నిండి ఉండటంతో రోగులకు అసౌకర్యంగా ఉంది. మిగిలిన ఐదు బెడ్లు వేసేందుకు గదిలో సౌకర్యం లేక పోవడంతో మూలన పడేశారు. దీంతో రోగులు అవస్థలు పడుతున్నారు. రోగులకు, వైద్యసిబ్బంది అవసరమైన మరుగుదొడ్లు, మూత్రశాలలు కూడా లేవు.

ఆస్పత్రి భవన నిర్మాణానికి రెండుసార్లు నిధులు మంజూరు..

ఆస్పత్రి భవన నిర్మాణం కోసం 1998లో రూ.40లక్షలు మంజూరు కాగా స్థలం లేక నిధులు వెనక్కు వెళ్లాయి. మళ్లీ 2003లో రూ.65 లక్షలు మంజూరయ్యాయి. గుడికి సమీపంలో రెవెన్యూ అధికారులు చూపించిన స్థలంలో ఆస్పత్రి నిర్మాణం ప్రారంభించారు. కానీ సదరు భూమి నాది అని ఒకరు కోర్టును ఆశ్రయించడంతో.. ఆస్పత్రి భవన నిర్మాణం నిలిచిపోయింది. ఈ నిధులు కూడా వెనక్కు వెళ్లాయి. గ్రామంలో కొంతమంది కలిసి రూ.4 లక్షల విరాళాలతో పది సంవత్సరాల క్రితం స్కూల్ ఎదుట ఆస్పత్రి భవన నిర్మాణం కోసం స్థలం కూడా కొనుగోలు చేసి రెవెన్యూ శాఖకు అప్పగించారు. కానీ అప్పుడు కూడా భవన నిర్మాణానికి కార్యరూపం దాల్చలేదు.


రోగుల బెడ్ల గదిలో సామగ్రి

పక్కా భవనం మంజూరు చేయాలి



గిరిజన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అద్దె భవనంలో కొనసాగుతోంది. ఇరుకు గదుల్లో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సీజన్‌లో రోగులు ఎక్కువమంది ఆస్పత్రికి వస్తుంటారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే ఆస్పత్రికి నూతన భవనాన్ని మంజూరు చేయాలి.

– గంధం ఏడుకొండలు, జగన్నాథపురం

స్థలం కొనుగోలు చేసి ఇచ్చాం



జగన్నాథపురం గిరిజన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి పది సంవత్సరాల క్రితం విరాళాలు సేకరించి హైస్కూల్ ఎదుట స్థలం కొనుగోలు చేసి అందుబాటులో ఉంచాం. కానీ ప్రభుత్వం ఆస్పత్రి భవనాన్ని మంజూరు చేయలేదు. అధికారులు పట్టించుకోలేదు.

– బండ్లపల్లి వెంకటనారాయణ, జగన్నాథపురం

ప్రతిపాదనలు పంపించాం



జగన్నాథపురంలోని గిరిజన ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నూతన భవన నిర్మాణం కోసం రూ.కోటి వ్యయంతో ప్రతిపాదనలు పంపించాం. ఐటీడీఏ పీఓ ద్వారా కూడా భవన నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరిగింది. నిధులు మంజూరు కాగానే నిర్మాణం చేపడతాం.

– శిరీష, జిల్లా వైద్యాధికారి

సమస్యలపై జెన్కో సీఎండీకి వినతి


ప్రభాకర్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న హెచ్142 నాయకులు

పాల్వంచ: కేటీపీఎస్ ఉద్యోగుల సమస్యలపై తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (హెచ్ 142) ఆధ్వర్యంలో ఆదివారం జెన్కో సీఎండీ డి.ప్రభాకర్‌రావుకు గెస్ట్ హౌజ్‌లో వినతిపత్రం అందజేశారు. అనంతరం సన్మానించారు.

ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ.రామారావు మాట్లాడుతూ.. కేటీపీఎస్ ఆస్పత్రిలో ఎక్స్‌రేను డిజిటల్‌గా మార్చాలని, చిల్డ్రన్స్ పార్క్ ఏర్పాటు, ఉద్యోగ, కార్మికులకు కొత్త క్వార్టర్ల నిర్మాణం, జీపీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఇందుకు సీఎండీ సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో వెంపటి వెంకటేశ్వర్లు, ఎస్.శ్రీనివాసాచారి, డి.సత్యరాజ్, ఎస్.నాగభూషణం, షేక్.సయ్యద్, ఎం.శివరాం, వెంపటి అనిల్, కె.పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

పోడు పట్టాలపై కాలయాపన


మాట్లాడుతున్న ఆవునూరి మధు

ఇల్లెందు: ప్రభుత్వానికి పోడు భూముల పంపిణీపై చిత్తశుద్ధి లేదని, పలు దఫాలు వాయిదాలు వేస్తూ కాలయాపన చేస్తోందని, తాత్సారం చేస్తే ప్రజలు గుణపాఠం చెప్పటం ఖాయని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం ఇల్లెందులోని ఎన్డీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 24వ తేదీ అని ప్రకటించిన ప్రభుత్వం మళ్లీ 30 అంటూ ప్రకటించిందన్నారు. అర్హులందరికీ పోడు పట్టాలు పంపిణీ చేయాలని కోరారు. ప్రభుత్వం మీద ఒత్తిడి పెంచేందుకు ఈ నెల 28 నుంచి జూలై 4 వరకు గ్రామాల్లో ఆందోళనలు, నిరసన ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్డీ ఇల్లెందు డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి సారంగపాణి, జిల్లా, డివిజన్, మండల నాయకులు యాకన్న, నాగేశ్వరరావు నర్సింహారావు, పోలారం, బోయితండా, పోచారం తండా సర్పంచ్‌లు వాంకుడోతు సరోజిని, సంతూ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

11వ వేతన ఒప్పందం చరిత్రాత్మకం


మాట్లాడుతున్న మాధవనాయక్

ఇల్లెందు: నిన్నటి 11వ వేతన ఒప్పందం చరిత్రాత్మకమైందని, 19శాతం ఎంజీబీ 25శాతం అలవెన్స్‌లపై పెరుగుదల సాధించటంలో బీఎంఎస్ కీలక పాత్ర పోషించిందని బీఎంఎస్ అనుబంధ సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.మాధవనాయక్ అన్నారు. ఆదివారం ఇల్లెందు జేకే ఓసీలో జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణిలో లాభాల వాటా ఈ నెలలో చెల్లించాలని డిమాండ్ చేశారు. గుర్తింపు సంఘం ఎన్నికలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుంటోందని విమర్శించారు. ప్రభుత్వం సింగరేణిని గుప్పిట్లో పెట్టుకుని తాత్సారం చేస్తోందన్నారు. కార్యక్రమంలో బీఎంఎస్ ఇల్లెందు ఏరియా ఉపాధ్యక్షుడు నాయని సైదులు, ఆరుట్ల మాధవరెడ్డి, జి.రాజశేఖర్, వై.నాగేశ్వరరావు, రాము, వెంకటేశ్వర్లు, కార్తీక్, సురేష్, రాము, శ్రీను, క్రాంతి, వెంకటేష్, శివ, పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


రుద్రంపూర్‌లో పాఠశాలలో 1996-97 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు

సింగరేణి(కొత్తగూడెం): రుద్రంపూర్ పాఠశాలలో 1996–97లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ రోజంతా సందడి చేశారు. ఉద్యోగరిత్యా ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఒక్కచోట చేరి మధుర స్మృతులకు స్మరించుకున్నారు. ఉద్యోగం, ఆర్థిక, కుటుంబ పరిస్థితులను ఒకరినొకరు పంచుకున్నారు. సహపంక్తి భోజనాలు చేసి, ఫొటోలు దిగారు.

ఆలయ నిర్మాణానికి వితరణ


వితరణ అందజేస్తున్న ఎడవల్లి కృష్ణ

పాల్వంచరూరల్: దంతలబోరు ఎస్సీకాలనీలో ముత్యాలమ్మతల్లి ఆలయ నిర్మాణానికి టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ ఆదివారం రూ.10వేల విరాళాన్ని గ్రామసర్పంచ్ గద్దల రమేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో బూసిపాక బజారు, సిద్దల వెంకటేశ్వర్లు, బండ్ల భిక్షం, సిద్దల పెరమయ్య, సిద్దల బుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి..

మండల పరిధిలోని పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి బూర్గంపాడుకు చెందిన బానోతు నర్సింహా రూ.10,116, పాల్వంచ అయ్యప్పనగర్‌కు చెందిన గొడ్డెటి ప్రసాద్, సునిత దంపతులు రూ.15,001 విరాళాన్ని అందజేసినట్లు ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి ఆదివారం తెలిపారు. విరాళాలు అందజేసిన భక్తులకు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలను అందజేసినట్లు పేర్కొన్నారు.

ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న వెంకటేశ్

టేకులపల్లి: రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కరాటేలో రాణిస్తున్న టేకులపల్లి మండలం కొప్పురాయి పంచాయతీ ఒడ్డుగూడెంకు చెందిన గగ్గెల సౌమ్యశ్రీ అంతర్జాతీయ స్థాయి మీట్‌కు వెళ్లేందుకు పేదరికం అడ్డురావడంతో ఆదుకోవాలని ఈనెల 7 న సాక్షిలో ప్రత్యేక వార్తా కథనం ప్రచురితమైంది. ఇప్పటికే పలువురు స్పందించారు. రాజారాంతండా గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భూక్యా వెంకటేశ్ ఆదివారం సౌమ్యశ్రీకి రూ.3వేలు ఆర్థిక సాయం అందజేశాడు.

ఉపా చట్టాన్ని రద్దు చేయాలి

ఇల్లెందు: ప్రజా ఉద్యమ నాయకుల మీద మోపిన అక్రమ కేసు ఉపాను తక్షణమే రద్దు చేయాలని ఎన్డీ అనుబంధ పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం ఇల్లెందులోని ఎన్డీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపా చట్టం రద్దు కోరుతూ ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ములుగు జిల్లా తాడ్వాయి పోలీసులు ప్రజా సంఘాల నేతలు ముఖ్యంగా పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య మీద నమోదు చేసిన ఉపా కేసును ఎత్తివేయాలని, ఆ కేసులో ఉన్న ప్రజా నేతలందరి మీద బేషరతుగా కేసు రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్డీ నేతలు రాసుద్దీన్, రాంసింగ్, ఎ.సాంబ, పీకే వెంకన్న, వీరన్న, కోటయ్య, కృష్ణ పాల్గొన్నారు.

రాజ్యాంగ రక్షణ అందరి బాధ్యత


అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

సుజాతనగర్: పూలే, అంబేడ్కర్ మహానుబావుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని కోరుతూ వేల్పుల భాస్కర్ అధ్యక్షతన ఆదివారం సుజాతనగర్‌లో అంబేడ్కర్ వాదుల క్యాడర్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రముఖ వైద్యులు కనకరాజు, విన్నయ్య మాట్లాడుతూ.. వేల సంవత్సరాల బానిస విముక్తి కోసం, అంటరాని తన నిర్మూలన కోసం అచంచలమైన కృషి చేసిన పూలే, అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. రోజురోజుకు దేశంలో మతవాదం పెరగటం వలన అంబేడ్కర్ వాదం సన్నగిల్లుతోందని, దానివలన రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడుతోందని వాపోయారు. దేశ సమస్త జీవరాశికి రక్షణ కల్పిస్తున్న రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అన్నివర్గాల ప్రజలపై ఉందని, దానికోసం మనందరం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. న్యాయవాది రమేష్ కుమార్ మక్కడ్ మాట్లాడుతూ.. ఓటుతో పాటు, అన్నివర్గాల ప్రజలకు హక్కులు, స్త్రీ సమానత్వ హక్కులు రాజ్యాంగంలో పొందుపరిచిన అపర మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను నేటి యువత సాధించాలని కోరారు. మల్లెల రామనాథం, తాండ్ర వెంకటేశ్వర్లు, వేల్పుల కృష్ణవేణి, ధంసలపూడి అమృత, కుక్కముడి అంజమ్మ, కవులూరి అరుణ, కేసుపాక రాజ్యలక్ష్మి, గద్దల అలివేలు పాల్గొన్నారు.

మంచినీటి సమస్యపై ఉద్యమిస్తాం..

సింగరేణి(కొత్తగూడెం): పట్టణ ప్రజల మంచినీటి కష్టాలను తీర్చకపోతే మున్సిపాలిటీని ఉద్యమిస్తామని జిల్లా సీపీఐ కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా హెచ్చరించారు. ఆదివారం రేగళ్ల కాలువ తండా వద్ద కిన్నెరసాని ఫిల్టర్ బెడ్‌ను సీపీఐ బృందం సందర్శించింది. మంచినీరు విడుదల కాకపోవటానికి గల కారణాలపై ఆరా తీశారు. మాట్లాడుతూ.. కొత్తగూడెం పట్టణ వ్యాప్తంగా మూడు నెలలుగా కిన్నెరసాని నీటి విడుదలలో అధికారుల జాప్యం తీవ్రంగా ఉందని, ప్రజలు ఇంత ఇబ్బంది పడుతున్నా అధికారులు స్పందించక పోవడం సరైంది కాదన్నారు. మంచినీటి సమస్య వచ్చినప్పుడు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాల్సిన యంత్రాంగం ప్రజల కష్టాలను గాలికొదిలేశారన్నారు. గతంలో ప్రతివార్డుకు రెండు మినీవాటర్ స్కీమ్‌లు ఉండేవని, అవి మరమ్మతులకు చేరుకున్నాయని ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు వార్డులో చేతిపంపులను ఏర్పాటు చేయాలని, అదేవిధంగా రిపేరులో ఉన్న మినీవాటర్ స్కీమ్ బోర్‌లను రిపేరు చేసి తక్షణం సమస్య పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ప్రజల హక్కులు పట్టని పాలకులు


మాట్లాడుతున్న ఎర్రయ్య

ఇల్లెందు: రాజ్యాంగం మీద ప్రమాణం చేసి ప్రజా హక్కులు కాపాడుతామని శపదం చేసిన పాలకులు వాటిని కాలరాస్తున్నరని యూసీసీఆర్ఐ(ఎంఎల్) అనుబంధ గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పడిగ ఎర్రయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని జవహర్ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ సంస్థ (టీపీడీఆర్) సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఎన్నికల ముందు పోడు భూములకు పట్టాలు ఇస్తామని ప్రకటించి నేటికీ పట్టాలు ఇవ్వకపోగా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ప్రతిరంగంలో ప్రజల బతుకులు మారకపోగా చిన్నాభిన్నం అవుతున్నాయని వాపోయారు. భూస్వాములు ఆధీనంలో లక్షల ఎకరాలు ఉన్నాయని, పేదలు మాత్రం సెంటు భూమి కోసం పోరాడుతున్నారని తెలిపారు. సామాన్యులకు అందనంతగా నిత్యావసరాల ధరలు పెరిగాయన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం హక్కుల పరిరక్షణ కోసం గ్రామీణ పేదల సంఘం, టీపీడీఆర్, యూసీసీఆర్(ఎంఎల్) పోరాడుతుందని పేర్కొన్నారు. దండా లింగయ్య, బాణాల లక్ష్మణాచారి, వీరయ్య, జక్కం శ్రీను, కె.వెంకన్న, ముడిగె రాములు, దండా లింగస్వామి, మంకిడి లింగరాజు, పడిగే రమేష్, రామారావు, బాలకృష్ణ, జగన్నాథం, మల్లయ్య, అక్తర్, ఉన్నిసా బేగం, రుక్మిణి పాల్గొన్నారు.

నవసమాజ నిర్మాణమే డీవీకే లక్ష్యం



మాట్లాడుతున్న గుమ్మడి నర్సయ్య

ఇల్లెందు: నూతన ప్రజాస్వామిక విప్లవ వెలుగులో నవసమాజ నిర్మాణమే లక్ష్యంగా నమ్మిన సిద్ధాంతం కోసం తుదిశ్వాస విడిచే వరకు పోరాడిన యోధుడు డీవీకే అని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. ఆదివారం ఎల్లన్న మెమోరియల్ ట్రస్టులో జరిగిన ప్రజాపంథా పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 1969లో లేబర్ డిపార్ట్‌మెంట్‌లో తన ఉద్యోగానికి రాజీనామా చేసి విప్లవోద్యమంలోకి వచ్చాడని తెలిపారు. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా మొక్కవోని ధైర్యంతో పోరాడిన డీవీకే ప్రజా ఉద్యమ నిర్మాణంలో అలుపెరుగని పోరాటం చేశాడన్నారు. బీడీ కార్మికోద్యమ నిర్మాణానికి అంకురార్పరణ చేశాడని కొనియాడారు. అలాంటి డీవీకే గత ఏడాది జూన్ 26న అమరుడయ్యాడని, ఆయన ప్రథమ వర్ధంతి సభను సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు అత్యధికంగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బుర్ర వెంకన్న, యాకుబ్‌షావలీ, పాయం వెంకన్న, గురునాథం, పిల్లి మల్లేష్, రంజాన్, వీరన్న పాల్గొన్నారు.


పీవైఎల్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి


జూలూరుపాడులో వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: జూలై 4, 5 తేదీలలో ఇల్లెందులో నిర్వహిస్తున్న పీవైఎల్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ పీవైఎల్ మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం ప్రచార పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీవైఎల్ నాయకులు ఆవుల చంద్రం, బైరెడ్డి అనిల్‌రెడ్డి, సమ్మయ్య, కమటం వెంకన్న, రాంచందర్ మాట్లాడుతూ.. దేశంలో, రాష్ట్రంలో నిరుద్యోగం తాండవిస్తోందని, ఉద్యోగాల భర్తీలో పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన హామీలను గాలికొదిలేసి నేడు మరోసారి గారడీ మాటలతో యువత ఓట్లకు గాలం వేసేందుకు రుణాల పేరుతో వస్తున్నారని విమర్శించారు. పాలకుల కుటిల యత్నాలను యువత గుర్తించి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కోరారు. పాలకుల నిరంకుశ వైఖరిపై భవిష్యత్ పోరాటాలపై మహాసభలలో మార్గనిర్దేశం చేస్తారని, మహాసభలకు యువత అధిక సంఖ్యలో హాజరై ఉద్యమబాటలో పయనించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కోటయ్య, మాధవరావు, రమణయ్య, నిశాంత్, శ్రీను, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: జూలై 4, 5 తేదీల్లో ఇల్లెందులో జరగనున్న ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) రాష్ట్రం 8వ మహాసభలను జయప్రదం చేయాలని పీవైఎల్ నేత నిరాజ్ పిలుపునిచ్చారు. జూలూరుపాడులో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పీవైఎల్ మహాసభల వాల్ పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడంలో విఫలమైనట్లు చెప్పారు. ఎన్నికల ముందు బీఆర్ఎస్ ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ సర్కార్‌కు నిరుద్యోగ యువత గుణపాఠం చెప్పాలన్నారు. పీవైఎల్ రాష్ట్ర మహాసభలకు యువతీ, యువకులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ మండల కార్యదర్శి వల్లోజు రమేష్, సైదులు, ఎస్కే జానీ, తేజ, అశోక్, ఐలయ్య, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



వానొస్తే 'నడక' యాతనే !

స్థానిక గురుకుల పాఠశాల పక్క నుంచి సుజాతనగర్‌కు వచ్చే దారిలో సీసీ రోడ్డు నిర్మాణానికి మోక్షం కలగడం లేదు. సుజాతనగర్ నుంచి కొత్తగూడెంకు ఎక్కువ మంది ప్రజలు ఈ రహదారి గుండానే రాకపోకలు సాగిస్తుంటారు. చిన్నపాటి వర్షానికే గుంతల్లో వర్షపు నీరు చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి వర్షాకాలంలో ఇలాగే ఉంటుందని అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సీసీ రోడ్డు మంజూరు చేయాలని కోరుతున్నారు. – సుజాతనగర్



ప్రశ్నించాల్సిన అధికారి : టి.వెంకటలక్ష్మి, ఎంపీడీఓ, సుజాతనగర్
ఫోన్ నెంబర్: 6303023384